క్లుప్తంగా

సంత వేలం వాయిదా

కొడకండ్ల: కొడకండ్ల సంత వేలంను ఏప్రిల్ 2కు వాయిదా వేసినట్లు పంచాయతీ కార్యదర్శి గంట శ్రీనివాస్ తెలిపారు. బుధవారం గ్రామ పంచాయతీ వద్ద సంత వేలంను నిర్వహించగా ఒక్కరే హాజరై పోటీదారులు రానందున వాయిదా వేసినట్లు ఆయన తెలిపారు. 2న నిర్వహించే వేలం పాటకు ఆసక్తికలిగిన వారు హాజరు కావాలని ఆయన కోరారు.

బడ్జెట్ కేటాయించాలి



కొడకండ్ల: రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఆర్యవైశ్య కార్పొరేషన్‌కు రూ. వెయ్యి కోట్ల బడ్జెట్‌ను కేటాయించాలని సీఎం రేవంత్‌రెడ్డిని బుధవారం కలిసి కోరినట్లు ఆర్యవైశ్య సంఘం నాయకుడు ఈడబ్ల్యూఎస్ రాష్ట్ర అధ్యక్షుడు పాలేపు సతీష్‌గుప్త తెలిపారు. బుధవారం హైదరాబాద్‌లో సీఎంను కలిసి ఆర్యవైశ్య కార్పొరేషన్ ఏర్పాటు చేసినందుకు కృతజ్ఞతలు తెలిపి బడ్జెట్ కేటాయించి ఆర్యవైశ్యుల అభ్యున్నతికి పాటుపడాలని కోరినట్లు చెప్పారు.

మంత్రి సురేఖను కలిసిన పద్మశాలీలు



దేవరుప్పుల: మంత్రి కొండా సురేఖను జిల్లాలో ఓ కార్యక్రమానికి వచ్చిన సందర్భంగా పద్మశాలీలు కలిసి పుష్పగుచ్ఛం ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఆయిల్ సీడ్స్ కార్పొరేషన్, గ్రీవర్స్‌ఫెడరేషన్ చైర్మన్ జంగా రాఘవరెడ్డి తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధులు కడవెండి వాస్తవ్యులు నల్లా నర్సింహులు వారసత్వ కుటుంబ సభ్యుడు నల్లా సత్యనారాయణను పరిచయం చేయగా ఆ వీరుడి స్ఫూర్తిని చాటాలని సూచించారు. రాష్ట్ర పద్మశాలీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వేముల బాలరాజు, పోపా అధ్యక్షుడు దోర్నాల వెంకటేశ్వర్లు, బిట్ల బాబు. కాముని శ్రీనివాస్, దొర్నాల రమేష్, పరమేష్, దేవరాజు, పాముమోహన్, రమేష్, సత్యనారాయణ ఉన్నారు.

కాంగ్రెస్ మండల అధ్యక్షుడు..

మంత్రి సురేఖను కాంగ్రెస్ పార్టీ మండల నూతన అధ్యక్షుడు నల్ల శ్రీరాములు ఆధ్వర్యంలో పలువురు కలిశారు. బీసీ సెల్ మండల అధ్యక్షుడు కాడబోయిన గణేష్, యాదవ సంఘం విద్యావంతుల జిల్లా ప్రతినిధి తోటకూరి పాండు కృష్ణ, యాకన్న, వెంకన్న ఉన్నారు.

మధుయాష్కీని కలిసిన కృష్ణమూర్తి



ఇటీవల మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడి మార్పు వివాదం నేపథ్యంలో కాంగ్రెస్ పెద్దలతోపాటు పలువురు మంత్రులను కలిసి తమకు న్యాయంచేయాలని పెద్ది కృష్ణమూర్తి వినతి పత్రం అందజేసినట్లు వివరించారు. హైదరాబాద్, కరీంనగర్, జనగామలో కాంగ్రెస్ ప్రచార కమిటీ రాష్ట్ర చైర్మన్ మధుయాష్కీతోపాటు మంత్రులు తుమ్మల నాగేశ్వర్‌రావు, దామోదర్ రాజనర్సింహ, పొన్నం ప్రభాకర్, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డిలను వేర్వేరుగా బుధవారం కలిసి పార్టీలో నెలకొన్న ప్రస్తుత పరిస్థితిని వివరించి, మూడు దశాబ్దాలుగా పార్టీ కోసం పాటుపడిన తమకు అన్యాయం జరుగకుండా చర్యలు తీసుకోవాలని కోరినట్లు తెలిపారు. మండల సీనియర్ నాయకుడు దామెర అనిల్‌కుమార్ తదితరులు ఉన్నారు.

కడియం కావ్యను కలిసిన విజయ



చిల్పూరు: వరంగల్ ఎంపీ అభ్యర్థి కడియం కావ్యను బీఆర్ఎస్ పార్టీ సాంస్కృతిక విభాగం నాయకురాలు ఎడవెల్లి విజయ బుధవారం హనుమకొండలోని ఆమె నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా విజయ మాట్లాడుతూ కావ్య గెలుపునకు కృషి చేస్తామని తెలిపారు. ఇల్లందుల విజయ్, అరూరి రవిచంద్ర, అరూరి సుధాకర్, ప్రభాకర్, అరూరి దాసు, ప్రభాకర్ తదితరులు ఉన్నారు.

ఇసుక ట్రాక్టర్ల సీజ్



పాలకుర్తి: మండలంలోని ముత్తారం, దర్దేపల్లి గ్రామాల నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను బుధవారం పట్టుకుని సీజ్ చేసినట్లు ఎస్సై సాయి ప్రసన్న కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ అనుమతి లేకుండా ఇసుక తరలిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఓటుహక్కు విలువైనది



స్టేషన్‌ఘన్‌పూర్: 5కే రన్‌ను జెండా ఊపి ప్రారంభిస్తున్న ఆర్డీఓ వెంకన్న



పాలకుర్తిటౌన్: 5కే రన్ నిర్వహిస్తున్న పోలీసులు, రెవెన్యూ అధికారులు

- ఘనంగా 5కే రన్
- హాజరైన ఆర్డీఓ, ఏసీపీలు

స్టేషన్‌ఘన్‌పూర్: ప్రజాస్వామ్య దేశంలో ఓటుహక్కు ఎంతో విలువైనదని, వజ్రాయుధం లాంటి ఓటు హక్కును అందరూ సద్వినియోగం చేసుకోవాలని నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, ఘన్‌పూర్ ఆర్డీఓ డీఎస్ వెంకన్న అన్నారు. ఎన్నికల కమిషన్, కలెక్టర్ ఆదేశాల మేరకు ఓటు హక్కు ప్రాధాన్యతపై ప్రజలను చైతన్యం చేసేందుకు బుధవారం డివిజన్‌కేంద్రంలో 5కే రన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయం సమీపాన జగ్జీవన్‌రామ్ విగ్రహం వద్ద ఆర్డీఓ వెంకన్న, ఘన్‌పూర్ ఏసీపీ భీమ్‌శర్మ జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. ర్యాలీ స్థానిక గాంధీ చౌరస్తా, శివాజీచౌక్ మీదుగా తిరిగి జగ్జీవన్‌రామ్ సెంటర్ వరకు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ ఓటుహక్కు ఎంతో అమూల్యమైందని, ప్రతి ఒక్కరూ నిర్భయంగా ఓటు వేసి తమ హక్కును సద్వినియోగం చేసుకోవాలన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో ఓటింగ్ శాతం పెంచడం, ప్రజలకు ఓటుహక్కుపై చైతన్యం చేసేందుకే కార్యక్రమాన్ని చేపట్టామని తెలిపారు. 18 సంవత్సరాల వయస్సు నిండిన యువతీయువకులు తప్పనిసరిగా ఓటరుగా నమోదు చేసుకోవాలని అన్నారు. దివ్యాంగులకు, 85 సంవత్సరాల వయస్సు పైబడిన వృద్ధులకు ఫారం 12డీ ద్వారా ఇంటివద్ద నుంచే ఓటువేసే అవకాశాన్ని కల్పిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఘన్‌పూర్ ఏసీపీ భీమ్‌శర్మ, సీఐ ముస్క రాజు, తహసీల్దార్ వెంకటేశ్వర్లు, ఎస్సైలు నాగరాజు, వినయ్, ఎంపీఓ సుధీర్, ఆర్ఐలు అర్జున్, రవీందర్, ఘన్‌పూర్ ఈఓ సత్యనారాయణ, పాలిటెక్నిక్, సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాల ప్రిన్సిపాళ్లు డాక్టర్ పోచయ్య, కాళహస్తి, రాజ్‌కుమార్, అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఓటు హక్కును ఉపయోగించుకోవాలి

పాలకుర్తి టౌన్: ప్రజాస్వామ్యంలో ప్రజలకు ఉపయోగపడే ఓటు హక్కును వజ్రాయుధంగా ఉపయోగించుకోవాలని వర్ధన్నపేట ఏసీపీ అంబటి నర్సయ్య అన్నారు. బుధవారం మండల కేంద్రంలో పార్లమెంట్ ఎన్నికల్లో ఓట్లను ఉపయోగించే నిమిత్తం ప్రజలు శాంతి భద్రతలు పాటించడం కోసం 5 కే రన్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా పాలకుర్తి రాజీవ్ చౌరస్తా నుంచి గుడివాడ, ఈరవెన్ను క్రాస్ రోడ్డు మీదుగా రన్ తీశారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడారు. అనంతరం 5 కే రన్‌లో పాల్గొన్న వారికి బహుమతులు అందజేశారు. తహసీల్దార్ వెంకటేశం, సీఐ మహేందర్‌రెడ్డి, ఎస్సై సాయి ప్రసన్న కుమార్, శ్రావన్‌కుమార్, చెన్న కేశవులు, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

‘గత ప్రభుత్వ విధానాలే రైతు పాలిట శాపం’



పరామర్శిస్తున్న ప్రతాప్‌రెడ్డి

బచ్చన్నపేట: గత ప్రభుత్వ విధానాలే నేడు రైతుల పాలిట శాపంగా మారాయని డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని పడమటికేశ్వాపూర్‌లో ఇటీవల ఆత్మహత్య చేసుకున్న కొమ్మాట రఘుపతి కుటుంబాన్ని పరామర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మృతుడు రఘుపతి భూమిని రికార్డులో నమోదు చేస్తామని రెవెన్యూ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ కొలిపాక సుమన్ డబ్బులను తీసుకొని నమోదు చేయలేదన్నారు. దీంతో మనస్థాపానికి గురై ఆత్మహత్య చేసుకన్నాడని అన్నారు. అవినీతి అధికారులను సస్పెండ్ చేసే వరకు ఊరుకోబోమని హెచ్చరించారు. కొడవటూర్ దేవస్థాన చైర్మన్ గాలి కృష్ణ, మండల ఇన్‌ఛార్జ్ నూకల బాల్‌రెడ్డి, నాయకులు జంగిటి విద్యానాథ్, పిన్నింటి నారాయణరెడ్డి, దిడ్డిగ రమేష్, అల్వాల ఎల్లయ్య,ఆరుగొండ పర్శరాములు పాల్గొన్నారు.

చిన్నతనం నుంచే దేశభక్తి నింపాలి



వేడుకలను ప్రారంభిస్తున్న అతిథులు

జనగామ: పిల్లల్లో చిన్న తనం నుంచే క్రమశిక్షణ, దేశ భక్తి పెంపొందించే విధంగా విద్యా బోధన ఉండాలని లెఫ్టినెంట్ కల్నల్, డాక్టర్ భిక్షపతి అన్నారు. పట్టణంలోని బాలాజీనగర్ ఎస్‌పీఆర్ కిడ్స్ పాఠశాల 9వ వార్షికోత్సవ వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. జిల్లా ఆస్పత్రుల సమన్వయ కర్త డాక్టర్ సుగుణాకర్‌రాజుతో కలిసి ఆయన జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధి కోసం స్కూల్ యాజమాన్యం చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. చిన్నారుల సాంస్కృతిక కార్య క్రమాలు అలరించాయి. పాఠశాల కరస్పాండెంట్ కీర్తి వీరేందర్, ప్రిన్సిపాల్ కె.శోభ, డైరెక్టర్లు ఉపేందర్‌బాబు, ప్రమోద్‌రెడ్డి, తిరుపతి రెడ్డి, ప్రభాకర్, కృష్ణ, ఉపాధ్యాయులు నవ్య, స్వర్ణలత, హర్షిత, ప్రియాంక, స్వాతి ఉన్నారు.

సొసైటీ చైర్మన్‌పై వీగిన అవిశ్వాసం



సమావేశంలో అధికారులు

పాలకుర్తి: మండలంలోని ఎల్లరాయని తొర్రూరు సహకార సంఘం (పీఏసీఎస్) చైర్మన్ గోనె మైసులుపై బీఆర్ఎస్ డైరెక్టర్లు పెట్టిన అవిశ్వాస తీర్మానం బుధవారం వీగి పోయినట్లు జిల్లా సహకార అధికారి రాజేందర్‌రెడ్డి ప్రకటించారు. తొర్రూరు సహకార సొసైటీలో మొత్తం 13 మంది డైరెక్టర్లు ఉండగా వారిలో బీఆర్ఎస్‌కు చెందిన వారు 10 మంది సభ్యులు, కాంగ్రెస్ నుంచి ముగ్గురు సభ్యులు మాత్రమే ఉన్నారు. ఒకరు అనారోగ్యంతో మృతి చెందారు. ఆ పార్టీకి చెందిన వారు ఇద్దరే ఉన్నారు. ఇందులో బీఆర్ఎస్ నుంచి చైర్మన్ గోనె మైసులుపై అవిశ్వాసం పెట్టాలని ఫిబ్రవరి 27న దరఖాస్తు చేశారు. అధికారులు మార్చి 27న అవిశ్వాస తీర్మాన సమావేశానికి ఆహ్వానించారు. ఉదయం 10 గంటలకు సభ్యులకు సమావేశానికి రావాలని నోటీసు జారీ చేశారు. సమావేశానికి సభ్యుల్లో గోనె మైసులు ఒక్కరు మాత్రమే హాజరయ్యారు. దీంతో సభ్యులు హాజరు కాకపోవడంతో తీర్మానం వీగి పోయిందని అధికారి ప్రకటించారు.

ఎల్లమ్మ ఉత్సవాలు షురూ



బోనాలతో వెళ్తున్న శాలివాహన కులస్తులు

బచ్చన్నపేట: మండలంలోని బండనాగారం గ్రామంలో శాలివాహన కులం వారు నిర్వహించే ఎల్లమ్మ ఉత్సవాలు బుధవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఆలయ కమిటీ చైర్మన్ ఇజ్జగిరి రాములు మాట్లాడుతూ పుట్టకు ధ్వని పోయడం, పూజ, జోగు తిప్పడం, పుట్ట బంగారం తేవడం, మైలలు తీయటం, బియ్యం సుంకు, మంగళగౌరీ స్నానాలు తదితర పూజలు చేపట్టామని చెప్పారు. అనంతరం ఊర దేవతలకు భోనాలను చేసినట్లు తెలిపారు. నేడు (గురువారం) రేణుకా ఎల్లమ్మ, జమదగ్నిల కల్యాణం నిర్వహించనున్నామన్నారు. కార్యక్రమంలో కులస్తులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో పలువురికి గాయాలు





క్షతగాత్రుడు నాగరాజు సందీప్

లింగాలఘణపురం: మండలంలోని కుందారం–పాలకుర్తి రోడ్డులో చీటూరు గ్రామ ఎస్సీ కాలనీ వద్ద బుధవారం రెండు బైక్‌లు ఎదురెదురుగా ఢీకొని సూర్యాపేట జిల్లాకు మోతె గ్రామానికి చెందిన మేకల నాగరాజు, దేవరుప్పుల మండలం మాదారం శివారు పెద్దతండాకు చెందిన గుగులోత్ సందీప్ తీవ్రంగా గాయపడ్డారు. నాగరాజు పాలకుర్తి నుంచి జనగామ వైపు ద్విచక్రవాహనంపై వస్తుండగా జనగామ నుంచి పాలకుర్తి వైపు ఎఫ్‌జెడ్ వాహనంపై వెళ్తున్న సందీప్ ఇద్దరు ఎదురెదురుగా ఢీకొన్నారు. నాగరాజు తలకు బలమైన గాయాలై పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలించారు.

గేమ్యతండా క్రాస్‌లో..

చిల్పూరు: చిన్నపెండ్యాల గ్రామ సమీపంలోని గేమ్యతండా క్రాస్ వద్ద బుధవారం సాయంత్రం ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో గీత కార్మికుడికి గాయాలయ్యాయి. చిన్నపెండ్యాల గ్రామానికి చెందిన తాళ్లపల్లి మురళిగౌడ్ రోజు మాదిరిగానే కల్లు గీసేందుకు ద్విచక్రవాహనంపై గేమ్యతండాకు వెళ్లేందుకు యూటర్న్ తీసుకుంటుండగా ఘన్‌పూర్ నుంచి హనుమకొండకు వెళ్తున్న ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో కాళ్లకు తీవ్రంగా గాయాలయ్యాయి. కానిస్టేబుల్ చారి గాయపడిన క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసిన్నట్లు ఎస్సై రాజేందర తెలిపారు.

తాటిచెట్టుపై నుంచి పడి గీత కార్మికుడికి..

నెల్లుట్లకు చెందిన గీత కార్మికుడు కొయ్యాడ భిక్షపతి బుధవారం తాటిచెట్టుపై నుంచి పడి తీవ్రంగా గాయపడ్డాడు. రోజువారి పనిలో భాగంగా తాటి చెట్టు ఎక్కగా ప్రమాదవశాత్తు కాలు జారి కిందపడగా కుడి కాలు, నడుము విరిగింది. సమీపంలోని గీత కార్మికులు జనగామ ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఈ సందర్భంగా కల్లుగీత కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి బాల్నె వెంకటమల్లయ్య గాయాలైన భిక్షపతిని పరామర్శించి మెరుగైన వైద్యం అందించాలని, రూ.5 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని డిమాండ్ చేశారు.

ఆలయ భూమిలో ఆక్రమణల తొలగింపు



ఆక్రమణలు కూల్చివేస్తున్న రెవెన్యూ అధికారులు, సిబ్బంది

స్టేషన్‌ఘన్‌పూర్: డివిజన్ కేంద్రంలోని బస్టాండ్ సమీపాన ఉన్న తిరుమలనాథ స్వామి ఆలయానికి చెందిన భూమిలో ముగ్గురు వ్యాపారులు సోమవారం రాత్రికి రాత్రే అక్రమంగా రేకులతో ఫెన్సింగ్ చేసి కబ్జాకు యత్నించగా విషయం తెలుసుకున్న రెవెన్యూ అధికారులు బుధవారం ఆక్రమణలను తొలగించారు. ఘన్‌పూర్ తహసీల్దార్ వెంకటేశ్వర్లు పర్యవేక్షణలో రెవెన్యూ సిబ్బంది ఫెన్సింగ్‌గా వేసిన రేకులను తొలగించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ దేవస్థాన భూమిని కబ్జా చేశారని పత్రికల్లో వచ్చిన వార్తలతో తమకు సమాచారం వచ్చిందన్నారు. విచారించగా కబ్జా చేసేందుకు ప్రయత్నించిన వారిపై పోలీసు కేసు నమోదైనట్లు తెలిసిందన్నారు. ప్రభుత్వ భూముల్లో ఎవరైనా అక్రమంగా కబ్జాలు చేయడం, నిర్మాణాలు చేస్తే సహించేది లేదని, ఎంతటి వారైనా చట్టపరంగా చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. కాగా దేవస్థాన భూమి కబ్జా ప్రయత్నాన్ని నివారిస్తూ సదరు స్థలంలో వేసిన రేకులను తొలగించడంపై భజరంగ్‌దళ్, విశ్వ హిందూ పరిషత్ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. డీటీ విజయ్‌కుమార్, ఆర్ఐలు రవీందర్, అర్జున్, రెవెన్యూ సిబ్బంది మహిపాల్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

కొలతల ప్రకారం పనులు చేయాలి



కూలీలతో మాట్లాడుతున్న శంకర్‌నాయక్

చిల్పూరు: ఎఫ్ఏలు ఇచ్చిన కొలతల ప్రకారం ఉపాధి కూలీలు పనులు చేయాలని ఎంపీడీఓ బర్మావత్ శంకర్‌నాయక్ అన్నారు. మండలంలోని వంగాలపల్లి, నష్కల్ గ్రామాల్లో బుధవారం నర్సరీలు, ఉపాధి కూలీలు చేస్తున్న పనులను ఉపాధిహామీ ఏపీఓ మోహన్‌రావు, ఎంపీఓ మధుసూదన్, పంచాయతీ కార్యదర్శి స్నేహలతో కలిసి పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవి ఎండలు ముదురుతున్నందున నర్సరీల్లో ఉన్న మొక్కలు ఎండిపోకుండా చూసుకోవాల్సిన బాధ్యత పంచాయతీ కార్యదర్శులదేనని అన్నారు. దీంతో పాటు కూలీలకు తాగునీరు, నీడ తదితర సౌకర్యాలు కల్పించాలని సూచించారు.

ఎమ్మెల్యేకు ఆహ్వానం



చిల్పూరు: మండలంలోని వెంకటాద్రిపేట గ్రామంలో ఈనెల 30 తేదీన చేపట్టనున్న అభయాంజనేయ స్వామి ఆలయ నిర్మాణ భూమి పూజకు రావాలంటూ బుధవారం ఎమ్మెల్యే కడియం శ్రీహరికి, ఎంపీ అభ్యర్థి కడియం కావ్యలకు వేర్వేరుగా కలిసి నిర్వాహకులు ఆహ్వాన పత్రికలను అందజేశారు. ఈ సందర్భంగా నోముల సురేష్, వారాల లింగమూర్తి, నోముల రమేష్, రవికుమార్, తొట్టె అశోక్ మాట్లాడుతూ 30న నిర్వహించే కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరు కావాలని కోరగా సానుకూలంగా స్పందించారని తెలిపారు.

పుస్తెమెట్టెల అందజేత



బచ్చన్నపేట: మండలంలోని వంగ సుదర్శన్‌రెడ్డి నగర్ గ్రామానికి చెందిన పేద కుటుంబానికి చెందిన జిట్ట కలవ్వ, కొమురయ్య కూతురు శ్రీవాణి వివాహానికి మాజీ సర్పంచ్ కోనేటి స్వామి, వాణిశ్రీ దంపతులు పుస్తెమెట్టెలను అందజేశారు. బుధవారం పుస్తెమెట్టెలను అందించి నూతన వధూవరులను ఆశీర్వదించారు. కార్యక్రమంలో కల్యాణ అనసూర్య, చవాన్ నరేష్, యాదగిరి, సోమిరెడ్డి, అన్వర్, ధనుంజయ్, నరేష్, శ్రీకాంత్, సాయి, మహేష్, అభిలాష్ పాల్గొన్నారు.

ఇసుక అక్రమ రవాణాకు పాల్పడితే చర్యలు



వాగును పరిశీలిస్తున్న ఏసీపీ నర్సయ్య తదితరులు

దేవరుప్పుల: ఇసుక అక్రమ రవాణాకు ఎవరు పాల్ప డినా చట్టపరంగా కఠిన చర్యలు తప్పవని వర్ధన్నపేట ఏసీపీ అంబటి నర్సయ్య హెచ్చరించారు. బుధవారం మండల కేంద్రంలోని దాదాసాహెబ్ కాలనీ సమీపంలోని వాగు నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ప్రాంతాన్ని పాలకుర్తి సీఐ మహేందర్ రెడ్డి, ఎస్సై చెన్నకేశవులు, పోలీస్ సిబ్బందితో కలిసి పరిశీలించారు. అనంతరం కాలనీలో ట్రాక్టర్ యజమానులు, యువత తల్లిదండ్రులతో ముఖాముఖి నిర్వహించి సమాజ రుగ్మతలపై అవగాహన కల్పించారు. ప్రభుత్వ అనుమతులు ఉంటే తప్ప ఇసుకను అక్రమంగా తరలిస్తే జరగబోయే నష్ట పరిణామాలను వివరించారు. ప్రధానంగా యువకులు లైసెన్స్ లేకుండా, 18 నిండని మైనర్లు వాహనాలను నడిపినా తల్లిదండ్రులపై కఠినమైన కేసులు నమోదు చేస్తామన్నారు.

గీతకార్మికులను ఆదుకోవాలి



నివాళులర్పిస్తున్న వెంకటమల్లయ్య తదితరులు

తరిగొప్పుల: రాష్ట్ర ప్రభుత్వం గీత కార్మికులను ఆదుకోవాలని తెలంగాణ కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బాల్నే వెంకటమల్లయ్య కోరారు. మండలకేంద్రానికి చెందిన కల్లుగీత కార్మికుడు తాళ్లపల్లి బక్కయ్య గౌడ్ ప్రమాదవశాత్తు తాటి చెట్టుపై నుంచి జారిపడి చికిత్స పొందుతూ మృతిచెందగా బుధవారం ఆయన పార్థివ దేహానికి పూలమాలలు వేసి బాధిత కుటుంబసభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా వెంకటమల్లయ్య మాట్లాడుతూ ప్రభుత్వాలు మారిన దినదిన గండంగా బతుకుతున్న కల్లుగీత కార్మికుల తలరాతలు మారడంలేదన్నారు. రూ.10 లక్షలు ఎక్స్‌గ్రేషియా వెంటనే అందజేసి బాధిత కుటుంబసభ్యులను ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. బాధిత కుటుంబసభ్యుల్లో ఒకరి ప్రభుత్వం ఉద్యోగం ఇవ్వాలని కోరారు. సంఘం జిల్లా అధ్యక్ష, ఉపాధ్యక్షులు కుర్ర ఉప్పలయ్య,జొన్నగోని శ్రీనివాస్‌గౌడ్, కంకటి రాజయ్య, బసవగాని మహేందర్, తాళ్లపల్లి పోషయ్య, రాజు,మురళి, నేమిలి శ్రీనివాస్, అంజయ్య, లింగం, విజయ్, పరుశరాములు, మల్లేషం, అశోక్ ఉన్నారు.

పరామర్శ....

మృతుడి తాళ్లపల్లి బక్కయ్యగౌడ్ కుటుంబసభ్యులను స్థానిక ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి పరామర్శించి రూ.5,000 సాయం అందజేశారు. ఆయన వెంట పింగిళి జగన్‌మోహన్‌రెడ్డి, చిలువేరు లింగం, తాళ్లపల్లి రాజేశ్వర్‌గౌడ్, రాజారాం ఉన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ



లింగాలఘణపురం: భారతమ్మకు నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే శ్రీహరి



బచ్చన్నపేట: ఆర్థికసాయం అందజేస్తున్న గంగం సతీష్‌రెడ్డి



బచ్చన్నపేట: ఆర్థికసాయం అందజేస్తున్న రాములు యాదవ్

లింగాలఘణపురం: మండలంలోని వనపర్తి మాజీ సర్పంచ్ ఉంగరాల శ్రీధర్ తల్లి భారతమ్మ, నేలపోగుల మాజీ సర్పంచ్ ఆగారెడ్డి, మరాఠి సత్తమ్మ అనారోగ్యంతో మృతి చెందగా బుధవారం ఎమ్మెల్యే కడియం శ్రీహరి బాధిత కుటుంబాలను పరామర్శించారు. మృతుల చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఎమ్మెల్యే వెంట జెడ్పీటీసీ గుడి వంశీధర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ దూసరి గణపతి, అనిల్‌రెడ్డి, అంజనేయులు, కృష్ణారెడ్డి, సంపత్, రమేష్, పోకల శంకరయ్య, మల్లేశం, శ్రీనివాసు తదితరులు ఉన్నారు.

బియ్యం అందజేత

మండలంలోని నేలపోగులలో మరాఠి సత్తమ్మ అనారోగ్యంతో మృతి చెందగా సాంస్కృతిక సేన రాష్ట్ర కార్యదర్శి, ఎంపీటీసీ గుగ్గిళ్ల నర్సయ్య ఆ కుటుంబాన్ని పరామర్శించి క్వింటా బియ్యం అందజేశారు. గైని ప్రవీణ్, నాగరాజు, అశోక్, సత్తయ్య, కొంరయ్య, అబ్బయ్య, ఉప్పలయ్య, సాయిలు తదితరులు ఉన్నారు.

ఖిలాషాపూర్‌లో..

రఘునాథపల్లి: మండలంలోని ఖిలాషాపూర్‌లో ఇటీవల బండి శంకర్‌కు చెందిన పెంకుటిల్లు షార్ట్‌సర్క్యూట్‌తో దగ్ధమై నిరాశ్రయులైన విషయం విదితమే. సమాచారం తెలుసుకున్న ఎమ్మెల్యే కడియం శ్రీహరి బీఆర్ఎస్ నాయకులతో కలిసి ఖిలాషాపూర్ చేరుకొని శంకర్ కుటుంబ సభ్యులను పరామర్శించారు. ప్రమాదానికి గల కారాణాలను అడిగి తెలుసుకున్నారు. కుటుంబానికి అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. జెడ్పీటీసీ బొల్లం అజయ్, మాజీ జెడ్పీటీసీ మారుజోడు రాంబాబు, వై కుమార్‌గౌడ్, వారాల రమేష్, నామాల బుచ్చయ్య, మల్కపురం లక్ష్మయ్య, చెంచు రమేష్ పాల్గొన్నారు.

ఆర్థికసాయం

బచ్చన్నపేట: మండలంలోని కొడవటూర్‌లో పందరి భక్తేశ్వర్ మృతి చెందాడు. కాగా, మాజీ సర్పంచ్, సర్పంచ్‌ల ఫోరం మండల మాజీ అధ్యక్షుడు గంగం సతీష్‌రెడ్డి బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి రూ.10వేల ఆర్థికసాయం బుధవారం అందజేశారు. మిన్నాలపురం కనుకయ్య, కిరకె కర్ణాకర్, కనకాచారి, రాజమల్లయ్య, యాకంరెడ్డి, బాలసిద్ధులు, రాంరెడ్డి, ఐలయ్య, శివకుమార్‌తోపాటు తదితరులు ఉన్నారు.

పోచన్నపేటలో..

మండలంలోని పోచన్నపేట గ్రామంలో నిలిగొండ వెంకటమ్మ మృతి చెందింది. కాగా బుధవారం బాధిత కుటుంబీకులను సామాజిక సేవాకర్త పోతుల రాములు యాదవ్ పరామర్శించి రూ.5వేల సాయం అందజేశారు. నాయకులు బుడిగె రామచంద్రం, సత్యనారాయణ, ఐలయ్య, మహేందర్, నర్సింహులు, బాబు, బాల్‌రాజు, ఎల్లేష్ తదితరులు ఉన్నారు.

చెక్‌పోస్ట్ పరిశీలన



లింగాలఘణపురం: పార్లమెంట్ ఎన్నికల కోడ్ నేపథ్యంలో బుధవారం స్టేషన్ ఘన్‌పూర్ ఆర్డీఓ వెంకన్న లింగాలఘణపురం మండలం జీడికల్ వద్ద ఏర్పాటు చేసిన చెక్‌పోస్ట్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరంతరం నిఘా ఉండాలని, ప్రతి వాహనాన్ని తనిఖీ చేయాలని సూచించారు. ఆర్డీఓ వెంట తహసీల్దార్ వినయలత, ఆర్ఐ కిశోక్, పోలీసులు ఉన్నారు.